సాక్షి ఆదిలాబాద్

శనివారం : 17 : మే : 2025



బాసరకు పోటెత్తిన భక్తులు

బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తమ చిన్నారులకు అక్షరశ్రీకార పూజలు చేయించారు. IIలో▸



ఉరుములు.. మెరుపులు.. వర్షం

జిల్లాలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. తాంసి సమీపంలో పంటచేనులో ఉన్న తాటిచెట్టుపై పిడుగు పడింది. IIIలో▸

గరిష్టం/కనిష్టం
37.0/26.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రతీవారం గ్రామాలను సందర్శించాలి



రికార్డుల గదిని పరిశీలిస్తున్న ఎస్పీ

బేల: ప్రతీవారం గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకుని సమాచార వ్యవస్థ పటిష్టంగా నిర్మించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. రికార్డుల గదిని పరిశీలించి, నిర్వహణపై ఆరా తీశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ ఉన్నారు.

110 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు

కైలాస్‌నగర్: యాసంగి సీజన్‌కు గాను జిల్లాలో 26 మంది రైతుల నుంచి 110 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. వరి ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 467 మెట్రిక్ టన్నుల వరిధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఇందులో గ్రేడ్-ఏ రకం రూ.2,320, సాధారణ రకం రూ.2,300 మద్దతు ధరతో రైతుల నుంచి ధాన్యం కొనుగో లు చేస్తూ వెంటనే మిల్లుకు తరలించామన్నారు. ఇందులో అదనపుకలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్‌వో వాజిద్ అలీ, డీఏవో శ్రీధర్ స్వామి, సివిల్ సప్లై డీఎం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల విక్రయానికి దరఖాస్తు చేసుకోండి

ఆదిలాబాద్‌టౌన్: 2025-26 విద్యా సంవత్సరంలో పాఠ్యపుస్తకాల విక్రయాల కోసం ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 లోగా డీఈవో పేరిట రూ.3వేల డీడీ తీసి డీఈవో కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. వ్యాట్ లైసెన్స్, కమర్షియల్ ట్యాక్స్, రిటర్న్ టర్నోవర్ ట్యాక్స్, ఆడిట్ రిపోర్టు, జీఎస్టీలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సార్వత్రిక సమ్మె వాయిదా

ఆదిలాబాద్: ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను వాయిదా వేసినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ తెలపారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ని రసిస్తూ ఈనెల 20 తలపెట్టిన సమ్మెను దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా జూలై 9కి వా యిదా వేస్తున్నట్లు వివరించారు. ఈనెల 20న మండల కేంద్రాలు, పని ప్రాంతాల్లో నిరసనలు వ్యక్తం చేయనున్నట్లు వెల్ల డించారు. ఇందులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంకా రాఘవులు, అధ్యక్షుడు స్వామి, యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆశన్న, ఐద్వా జి ల్లా ఉపాధ్యక్షురాలు మంజుల, పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రాక

కైలాస్‌నగర్: రాష్ట్ర రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు ఉట్నూర్ మండల కేంద్రానికి చేరుకుంటారు. ఐటీడీఏ పీవో, ఇతర అధికారులతో పలు అంశాలపై సమీక్షించనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు ఆదిలాబాద్ చేరుకుని, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

తుది జాబితా విడుదల

ఆదిలాబాద్‌టౌన్: వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఎన్‌హెచ్‌ఎం పరిధిలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ పోస్టు తుది జాబితా విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తెలిపారు. కార్యాలయ నోటీసు బోర్డు, adilabad. telangana. gov.in వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

ఆత్యాపాత్యా జిల్లా నూతన కార్యవర్గం

అదిలాబాద్: ఆత్యాపాత్యా సంఘం జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. స్థానిక గజిటెడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా కలాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గణేశ్, కోశాధికారిగా మజర్ల ఎన్నికయ్యారు. 15 మండలాల నుంచి వచ్చిన అధ్యక్ష కార్యదర్శులు ఇందులో పాల్గొన్నారు. ఇందులో సీనియర్ ఉపాధ్యాయులు హరిచరణ్, రమణ, రాము, రవి, గౌతమ్, సింధు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం ధరలు దిగొచ్చే..



జిల్లా కేంద్రంలోని ఓ దుకాణంలో నిల్వచేసిన బియ్యం బస్తాలు

- క్వింటాలుకు రూ.800 నుంచి రూ.1700 డౌన్
- కొనుగోలుకు ఆసక్తి చూపని జనం
- రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ ప్రభావం
- గిరాకీ లేక వెలవెలబోతున్న దుకాణాలు



సన్న బియ్యం రకాలు

కైలాస్‌నగర్: బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు భారీగా తగ్గాయి. గతేడాదితో పోల్చితే క్వింటాల్‌కు రూ.800 నుంచి రూ.1,600 వరకు తగ్గుముఖం పట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ ద్వారా పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. లబ్ధిదారులు వీటిని సద్వినియోగం చేసుకుంటుండగా.. మార్కెట్‌లో ధరలు దిగొస్తున్నాయి. గిరాకీ లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. మరోవైపు ఈ స్థాయిలో ధరలు పడిపోవడం ఇదే తొలిసారి అని వ్యాపారులు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

రాష్ట్ర ప్రభుత్వం ఉగాది కానుకగా పేదలకు ప్రతిష్టాత్మకంగా సన్నబియ్యం పంపిణీని ప్రారంభించింది. తెల్లరేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లోని ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా అందజేస్తోంది. ఇవి నాణ్యతతో ఉండటంతో లబ్ధిదారులు వాటిని తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒకటో తారీకు వచ్చిందంటే చాలు షాపుల వద్ద బారులు తీరి మరీ తెచ్చుకుంటున్నారు. నెల మొదటి వారంలోనే 80 శాతం పంపిణీ పూర్తవుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సన్నరకాల వడ్లసాగును ప్రోత్సహిస్తోంది. రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ సైతం చెల్లిస్తోంది. తద్వారా సన్నాల దిగుబడి పెరిగింది. దీంతో ఇటు ప్రభుత్వం, అటు మిల్లర్లు పోటీపడి మరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న పరిస్థితి. ఈ క్రమంలో బియ్యం సరఫరా ఒక్కసారిగా పెరిగింది. అయితే రేషన్ పంపిణీ కారణంగాపేద,మధ్యతరగతి ప్రజలు మార్కెట్‌లో బియ్యం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. చేసేది లేక వ్యాపారులు ధరలు తగ్గించేస్తున్నారు. గతేడాదితో పోల్చితే క్వింటాల్‌కు పాతవి రూ.800 నుంచి రూ.1600 వరకు, కొత్తవి రూ.1,250 నుంచి రూ.1,700 మేర ధర తగ్గడం గమనార్హం.

తగ్గిన కొనుగోళ్లు..

గత ప్రభుత్వ హయాంలో తెల్లరేషన్ కార్డుదారులకు దొడ్డు బియ్యం పంపిణీ చేసేవారు. దీంతో లబ్ధిదారులు వాటిని తినలేక రేషన్ డీలర్లకు తక్కువకు అమ్ముకుని మార్కెట్‌లో సన్నబియ్యం కొనుగోలు చేసేవారు. గతేడాది ప్రీమియం రకం (పాతవి) క్వింటాల్‌కు రూ.5,900 నుంచి నుంచి రూ.6900 వరకు పలకగా.. ప్రస్తుతం ఇవి రూ.4,300 నుంచి రూ.6,100 వరకు లభిస్తున్నాయి. అలాగే కొత్తవి రకాన్ని బట్టి గతంలో రూ.5వేల నుంచి రూ.6,500 వరకు ధర పలకగా.. ప్రస్తుతం రూ.3,700 నుంచి రూ.5,250 వరకు విక్రయిస్తున్నారు. ధరలు తగ్గినా కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో ఉండకపోవడంతో జిల్లాలోని బియ్యం విక్రయ దుకాణాలు వెలవెలబోయి దర్శనమిస్తున్నాయి.

ఈ స్థాయిలో ధరలు తగ్గడం తొలిసారి



నేను 30 ఏళ్ల నుంచి బియ్యం అమ్ముతున్నా. ఏటా వరి ధాన్యం చేతికచ్చినప్పటి నుంచి క్వింటాల్ ధర రూ.5వేలతో మొదలై బియ్యం పాతబడుతున్న కొద్దీ వాటి ధర పెరిగేదే తప్పా తగ్గేదే కాదు. పోయిన సంవత్సరంతో పోల్చితే ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.1000 నుంచి రూ.1700 దాకా తగ్గినయ్. ఇన్నేళ్ల నా వ్యాపార జీవితంలో ఇంత ధర తగ్గడం తొలిసారి చూస్తున్న. సన్న బియ్యం విక్రయాలు 70 శాతం పడిపోయాయి. వ్యాపారం ఆశించినంత లేదు.

– కిరణ్ కుమార్, బియ్యం వ్యాపారి, ఆదిలాబాద్

పంట దిగుబడి పెరగడంతోనే..



రాష్ట్రంలో సన్నరకం వడ్ల సాగు గణనీయంగా పెరిగింది. దిగుబడి కూడా అధికమైంది. దీనికి తోడు ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తోంది. గతంలో చాలా మంది రేషన్ షాపుల్లో ఇచ్చే దొడ్డు బియ్యం అమ్ముకొని సన్న బియ్యం కొనుక్కునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దీంతోనే బియ్యం ధరలు మార్కెట్‌లో గణనీయంగా పడిపోయాయి. షాపుల కిరాయిలు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇదే కొనసాగితే దుకాణాలు మూసేయాల్సిందే.

– సునీల్‌కుమార్, బియ్యం వ్యాపారి, ఆదిలాబాద్

జిల్లాలో బియ్యం ధరల వివరాలు .. (ప్రస్తుతం, గతేడాది ఇదే సీజన్‌లో)

బియ్యం రకం	పాతవి		కొత్తవి	
	గతేడాది	ప్రస్తుతం	గతేడాది	ప్రస్తుతం
బీపీటీ	రూ.5,900	రూ.4,300	రూ.5,000	రూ.3,700
హెచ్‌ఎంటీ	రూ.6,100	రూ.4,700	రూ.5,800	రూ.4,100
జైశ్రీరామ్	రూ.6,900	రూ.6,100	రూ.6,500	రూ.5,250

ఇక ఊరూరా క్షయ పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

సంవత్సరం	టీబీ కేసులు
2022	1565
2023	1476
2024	1602
2025	1038 (ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారు)

- ఈనెల 19న టీబీ ముక్త్ భారత్ అభియాన్‌కు శ్రీకారం
- ప్రణాళిక సిద్ధం చేస్తున్న వైద్యశాఖ
- వంద రోజుల కార్యక్రమంలో 522 మందికి వ్యాధి నిర్ధారణ
- టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు కసరత్తు

ఆదిలాబాద్‌టౌన్: టీబీ మహమ్మారికి చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దేశంలో 2025 ముగిసే సరికి క్షయను సమూలంగా నిర్మూలించేందుకు కసరత్తు చేస్తోంది. వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతుంది. ఇందులో భాగంగా తెలంగాణలోని తొమ్మిది జిల్లాల్లో నిక్షయ్ శివిర్ వంద రోజుల కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జిల్లాలో సైతం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. 522 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించారు. ఈ కార్యక్రమం సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌కి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇకనుంచి పల్లెల్లో ఇంటింటికీ టీబీ పరీక్షలు చేయనుంది. నిరంతర ప్రక్రియగా కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇప్పటికే వైద్యాధికారులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఊరూరా వైద్య పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో టీబీని అంతమొందించే అవకాశం ఉంది.

చాపకింద నీరులా..

టీబీ మహమ్మారి చాపకింద నీరులా విస్తరిస్తోంది. అంటువ్యాధి కావడంతో ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. చాలా మంది పరీక్షలు చేసుకునేందుకు ముందుకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, చుట్టుపక్కల వారికి సోకుతుంది. వ్యాధి సోకినవారు చికిత్స తీసుకోకపోవడంతో టీబీ ముదిరి మృత్యువాత పడుతున్నారు. 3 నుంచి 5 శాతం మంది చనిపోతున్నట్లు తెలుస్తోంది. సకాలంలో మందులు వాడితే ఆరు నెలల్లోనే నయం అవుతుందని వైద్యులు సూచిస్తున్నారు. టీబీలో రెండు రకాలు ఉండగా.. ఊపిరితిత్తులకు వచ్చిన టీబీ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుండగా, శరీరంలో ఇతర భాగాలకు వచ్చింది మాత్రం విస్తరించకుండా ఉంటుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు దాదాపు 2వేల మందికి సోకగా, దాదాపు 25 మంది మృతి చెందినట్లు సమాచారం.

సత్ఫలితాలు ఇవ్వడంతో..

టీబీ నిక్షయ్ శివిర్ వంద రోజుల కార్యక్రమం ఆదిలాబాద్ జిల్లాతో పాటు భద్రాచలం, మెదక్, నాగర్ కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, కరీంనగర్, పెద్దపల్లి, సూర్యాపేట్‌లలో నిర్వహించారు. జిల్లాలో వంద రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్, వైద్య పరీక్షలు నిర్వహించారు. 4లక్షల 9వేల మందికి స్క్రీనింగ్ చేశారు. 10వేల మందికి పరీక్షలు నిర్వహించగా, 522 మందికి టీబీ నిర్ధారణ అయ్యింది. 953 క్యాంపులు నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే వంద రోజుల్లో జిల్లా అంతటా కార్యక్రమాలు నిర్వహించలేకపోయారు. ఇకనుంచి ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా చేపట్టనున్నారు. ముఖ్యంగా షుగర్, బీపీ, టీబీ వ్యాధిగ్రస్తుల ఇంట్లో వారికి, 60ఏళ్లు పైబడిన వారికి, మద్యం, దూమపానం సేవించే వారు, బరువు తక్కువగా ఉన్నవారికి, అనుమానితులకు పరీక్షలు చేయనున్నారు.

గ్రామాల్లోనే ఎక్స్‌రేలు..

గ్రామ గ్రామాన నిర్వహించే పరీక్షల్లో అక్కడే ఎక్స్‌రేలు తీయనున్నారు. హ్యాండ్ హెల్డ్ ఎక్స్‌రే మిషన్ ద్వారా పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే తెమడ సేకరించి ట్రూనాట్ యంత్రం ద్వారా పరీక్షలు చేస్తారు. ఆదిలాబాద్, నార్నూర్, ఉట్నూర్, జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఈ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో 1,038 మంది టీబీ మందులను వాడుతున్నారు.

వ్యాధిగ్రస్తులకు ఉచిత చికిత్స

టీబీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు మందులు పంపిణీ చేస్తున్నాం. రిమ్స్, బోథ్, నార్నూర్, ఉట్నూర్ ఆస్పత్రుల్లో ట్రూనాట్ ద్వారా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. మందులు వాడితే ఆరు నెలల్లోనే వ్యాధి నయం అవుతుంది. వ్యాధిగ్రస్తులకు పోషకాహారం కోసం నెలకు రూ.వెయ్యి చొప్పున అందిస్తున్నాం.

– డాక్టర్ సుమలత, జిల్లా టీబీ నిర్మూలన అధికారి

టీబీ నిర్మూలనే లక్ష్యం..

టీబీ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా ముందు కు సాగుతున్నాం. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా పరీక్షలు చేయగా, 522 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. కేంద్ర ప్రభుత్వం దేశంలో 2025 నాటికి ఈ వ్యాధిని నిర్మూలించేందుకు టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని చేపడుతోంది. ప్రతి ఒక్కరూ వైద్యపరీక్షలు చేసుకోవాలి. మందుల ద్వా రా వ్యాధి నయం అవుతుంది. అపోహలు వీడాలి.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

చిక్కడు.. దొరకడు



మహిళను నమ్మించి బంగారం ఎత్తుకెళ్లిన దుండగుడు (ఫైల్)



వేషం మార్చిన నిందితుడు షేక్ అల్తాఫ్

- వేషాలు మార్చుతూ.. మాయమాటలు చెబుతూ
- నమ్మిస్తూ బంగారం దోచుకెళ్తున్న దుండగుడు
- దడ పుట్టిస్తున్న అంతర్రాష్ట్ర దొంగ
- నిందితుడిపై ఇప్పటికే 50కి పైగా కేసులు

ఆదిలాబాద్‌టౌన్: అమాయకులను టార్గెట్ చేసుకొని అంతర్రాష్ట్ర దొంగ దడ పుట్టిస్తున్నాడు.. బ్యాంకు రుణం ఇప్పిస్తాం.. ఎలాంటి షూరిటీలు అవసరం లేదు.. మెడలో ఉన్న బంగారం చూపిస్తే చాలు.. లాటరీ తగిలింది.. లక్కీ కూపన్ ద్వారా ఎంపికయ్యారంటూ.. ఇలా అనేక మాయ మాటలు చెప్పి అందినకాడికి దోచుకుంటున్నాడు ఈ కేటుగాడు. జిల్లాలోనే కాదు.. తెలంగాణతో పాటు మహారాష్ట్రలో సైతం ఇదే పని కానిచ్చేస్తున్నాడు. ఇప్పటికే పలు కేసుల్లో జైలు జీవితం అనుభవించాడు. అయినా తీరుమారట్లేదు. ఆయా కాలనీల్లో రెక్కీ నిర్వహించి ఎవరికి ఏ అవసరాలు ఉన్నాయి.. ఎవరు ఇబ్బందుల్లో ఉన్నారనేది తెలుసుకుంటాడు. వాటిని గుర్తించి ప్రలోభాలకు గురిచేస్తాడు. ముఖ్యంగా మహిళల మెడలో ఉన్న బంగారం ఎత్తుకెళ్తున్నాడు. పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. నాలుగు నెలల క్రితం ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరానగర్‌లో ఓ మహిళ నుంచి బంగారం ఎత్తుకెళ్లాడు. రెండు మూడు రోజుల క్రితం మరోసారి జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో మహిళను నమ్మించి బంగారం ఎత్తుకెళ్లాడు. దుండగుడి కోసం పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు నియమించారు.

వేషాలు మార్చుతూ..

హైదరాబాద్‌లోని యాఖుబ్‌పూరకు చెందిన షేక్ అల్తాఫ్ వేషాలు మార్చుతూ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులను టార్గెట్ చేస్తూ వారి మెడలో ఉన్న బంగారం ఎత్తుకెళ్తున్నాడు. తలపై సగం వెంట్రుకలు ఉండగా, దొంగతనానికి పాల్పడిన తర్వాత టోపీ ధరించడం, విగ్ పెట్టుకోవడం, సూట్ వేసుకోవడం, హెల్మెట్ పెట్టుకోవడం.. ఎవరు గుర్తుపట్టకుండా హెయిర్ స్టైల్ మార్చుతూ వివిధ వేషాల్లో తిరుగుతున్నాడు. పలుమార్లు జైలు శిక్ష అనుభవించాడు. విడుదలయ్యాక మళ్లీ మోసాలకు పాల్పడటం వెన్నతో పెట్టిన విద్య. ఇలాంటి వారిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. మహారాష్ట్రలోని బల్సోడిలో గల అంతులేనగర్‌లో ఓ మహిళపై కత్తితో దాడి చేసి బంగారు ఆభరణం ఎత్తుకెళ్లాడు. అలాగే ముంబాయ్‌లోని పన్వేల్‌లో లైంగికదాడి కేసులో ఐదేళ్ల జైలు జీవితం అనుభవించాడు. హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్ పీఎస్‌లో దొంగతనం కేసులో రెండు నెలల జైలు శిక్ష, కామారెడ్డిలోని దేవున్‌పల్లిలో దొంగతనం కేసులో రెండు, నాలుగు నెలల జైలు జీవితం గడిపాడు. ఆదిలాబాద్ జిల్లాతో పాటు నిర్మల్, నిజామాబాద్, హైదరాబాద్, కామారెడ్డి, మహారాష్ట్రలో 50కి పైగా కేసులు ఉన్నాయి. నిందితుడి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నారు.

నమ్మించి.. ఇలా మోసం చేస్తూ..

- ఆదిలాబాద్‌లోని ఇందిరానగర్‌కు చెందిన ఓ మహిళను దుండగుడు నమ్మించి మోసగించాడు. నాలుగు నెలల క్రితం నూతనంగా ని ర్మిస్తున్న ఇంటి వద్దకు వెళ్లి మీరు సిమెంట్ బ్యాగులు కొనుగోలు చేసినందుకు లక్కీ కూపన్ వచ్చింది. రూ.లక్షవిలువ గల వస్తువులు కానీ, వస్తువులు అవసరం లేనట్లయితే నగదు తీసుకోవచ్చని నమ్మించాడు. తన బైక్‌పైనే ఆ మహిళను తీసుకెళ్లి సిమెంట్ షాప్ మూసి ఉందని, అక్కడే ఉండాలని చెప్పాడు. ఆభరణాలు ఉంటే డబ్బులు ఇవ్వరని, తీసి తనకు ఇవ్వమని మాయమాటలు చెప్పి నమ్మించాడు. రెండున్నర తులాల బంగారం ఆయనకు ఇవ్వగా పరారయ్యాడు.
- ఇటీవల మావల పోలీసు స్టేషన్‌పరిధి దస్నాపూర్‌లో ఓ వృద్ధురాలి ఇంటికి వెళ్లాడు. రూ.లక్ష బ్యాంకు రుణం మంజూరైందని, ఎలాంటి షూరిటీ అవసరం లేదని నమ్మించాడు. బ్యాంకు అధికారులకు మెడలో ఉన్న బంగారం చూపిస్తేచాలు అని నమ్మబలికాడు. దీంతో ఆ వృద్ధురాలు తన అన్న అయిన వృద్ధుడికి బంగారం ఇచ్చి ద్విచక్రవాహనంపై వెంట పంపిచ్చింది. రాంనగర్‌లోని ఓ ఆన్‌లైన్ సెంటర్‌కు తీసుకెళ్లాడు. మెట్ల దగ్గరే ఉండాలని వృద్ధుడికి చెప్పి పైకి వెళ్లి కొంత సమయం తిరిగి వచ్చాడు. ఆధార్ కార్డు అవసరం ఉందని, తీసుకురావాలని చెప్పాడు. బంగారం తనవద్ద ఉంచాలని సూచించాడు. దీంతో ఆవృద్ధుడు మూడు తులాల బంగారం అతని చేతిలో పెట్టి ఆధార్ కోసం వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వచ్చేసరికి దుండగుడు కనిపించకుండా పోయాడు.

మాయమాటలు చెప్పి బురిడీ కొట్టిస్తాడు..

హైదరాబాద్‌లోని యాఖుబ్‌పూరకు చెందిన షేక్ అల్తాఫ్ మహిళలు, వృద్ధులను టార్గెట్ చేస్తూ బంగారం దోచుకెళ్తున్నాడు. ఆదిలాబాద్‌తో పాటు అనేక ప్రాంతాల్లో కేసులు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో నాలుగు నెలల క్రితం ఓ మహిళకు మాయమాటలు చెప్పి బంగారం దోచుకెళ్లాడు. ఇటీవల దస్నాపూర్‌లో ఓ వృద్ధురాలి బంగారం ఎత్తుకెళ్లాడు. నిందితుడిని పట్టుకోవడం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వారి వెంట రమ్మంటే నమ్మి వెళ్లకూడదు. ఇలాంటి వారి విషయంలో మహిళలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి.

– ఎల్.జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- కలెక్టర్ రాజర్షి షా
- అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: గ్రామాల్లో తాగునీటి సరఫరాలో సమస్య తలెత్తకుండా చూడాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రౌండ్‌వాటర్ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. నీటి సరఫరా కోసం చేపట్టిన పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు 24 పనులు మంజూరు కాగా అందులో ఐదు పనులు పూర్తయ్యాయని మరో 11 పురోగతిలో ఉన్నాయని, 8 ప్రారంభం కాలేదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి ముగిసేవరకు ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలన్నారు. అవసరం ఉన్నచోట స్థానిక నీటి వనరులను, ట్యాంకర్లను వినియోగించుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇంట్రా, గ్రిడ్, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తమ శాఖల ప్రగతిని కలెక్టర్‌కు వివరించారు. ఇందులో డీఆర్డీవో రాథోడ్ రవీందర్, పీఆర్ ఈఈ రాథోడ్ శివరాం, సీపీవో వెంకట రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చంద్రమోహన్, గ్రౌండ్‌వాటర్ ఏడీ శ్రీవల్లి, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దాలి

సాత్నాల: పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన భోరజ్‌ను రెవెన్యూ సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుకు హాజరై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దరఖాస్తుల వెరిఫికేషన్ టీం ఇక అందుబాటులో ఉంటుందన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ రాజేశ్వరి, నలందప్రియ,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నిర్మూలనకు చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో డెంగీ నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని కేఆర్‌కే కాలనీ బస్తీ దవాఖానాలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. కరపత్రాలు విడుదల చేశారు. టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. డెంగీ నివారణ, అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇందులో డీఎంహెచ్‌వో నరేందర్‌రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, టీబీ నిర్మూలన అధికారి సుమలత, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

అడవిపంది దాడిలో రైతుకు గాయాలు

తాంసి: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల సమీపంలోని పంటచేను నుంచి శుక్రవారం మధ్యాహ్నం అడవిపంది గ్రామానికి వచ్చింది. ఒక్కసారిగా గ్రామప్రజలు భయాందోళనకు గురయ్యారు. అరుపులు,కేకలు వేస్తూ పంటచేల వైపు అడవి పందిని తరిమేశారు. ఈక్రమంలో రైతు గుగ్గిల పొచ్చన్నపై దాడి చేసింది. ఆయన కాలికి స్వల్ప గాయమైంది. వెంటనే అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు.

కలప స్వాధీనం



కలపతో అటవీ అధికారులు

ఇచ్చోడ: బజార్‌హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామానికి చెందిన వడ్రంగి గద్దె శ్రీనివాస్ వద్ద కలపను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఇచ్చోడ ఎఫ్ఆర్వో పుండలిక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇచ్చోడ మండలం చించోలికి చెందిన మతిన్ కలపను గద్దె శ్రీనివాస్‌కు విక్రయించాడు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు గిర్నూర్‌లో తనిఖీ నిర్వహించి గద్దె శ్రీనివాస్ వద్ద రూ.25 వేల విలువ గల కలపను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.

ఎండు గంజాయి పట్టివేత

భీంపూర్: మండలంలోని ఆర్లి(టీ) గ్రామంలో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారంతో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన అశోక్ వద్ద నుంచి 4.5 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై వెంకటేశ్వర్, హెడ్ కానిస్టేబుల్ సుధామ్, తానాజీ, కానిస్టేబుల్ నానంగ్ సింగ్, ధన్‌రాజ్, హన్మంత్, లత తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

తలమడుగు: మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్న ప్యాసింజర్ రైలులో గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని తలమడుగు రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన కాంబ్లె ధీరజ్ మహారాష్ట్రలోని కిన్వాట్ నుంచి ప్యాసింజర్ రైలులో ఆదిలాబాద్‌కు గంజాయిని తీసుకువస్తున్నాడు. రైల్వేస్టేషన్‌లో పోలీసులు తనిఖీ నిర్వహించగా ధీరజ్ పరుగు తీయగా పట్టుకున్నారు. అతని వద్ద 300 గ్రాముల గంజాయి లభించింది. వీటి విలువ దాదాపు రూ. 7500 ఉంటుందని ఎస్సై తెలిపారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపా రు.

కల్వర్టుపైకి దూసుకెళ్లిన కారు

కుంటాల: స్థానిక మున్నూరు కాపు సంఘం వద్ద అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి కల్వర్టుపైకి దూసుకెళ్లింది. కుంటాలలో శుక్రవారం భూభారతి రెవెన్యూ సదస్సుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విచ్చేస్తున్నారు. మంత్రికి స్వాగతం పలికేందుకు భైంసా హెలిప్యాడ్ వద్దకు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు కల్వర్టు పైనుంచి కారు తప్పించారు.

బైక్ చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన షిండే రామ్ బైక్‌చోరీకి గురైంది. జిల్లా కేంద్రంలోని రవితేజ హోటల్ సమీపంలో శుక్రవారం బైక్ పార్కింగ్ చేశాడు. గంట తర్వాత వచ్చి చూసేసరికి కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల వెతికినా లభించక పోవడంతో టూటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు స్ప్రింక్లర్ల పైపులు దగ్ధం

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామంలో గురువారం సాయంత్రం పంట పొలంలో స్ప్రింక్లర్ల పైపులు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమయ్యాయి. నిప్పురవ్వలు అంటుకుని 50 స్ప్రింక్లర్ పైపులు కాలిపోయాయి. వీటి విలువ దాదాపు రూ.60 వేల వరకు ఉంటుందని బాధిత రైతు గంగాధర్ తెలిపాడు. విషయం తెలుసుకున్న ఏఈవో అర్ష సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధిత రైతును అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం తనకు ఆర్థికసాయం అందించాలని బాధిత రైతు కోరాడు.

చిన్నయ్యగుట్టను చూసొద్దాం



చిన్నయ్య గుట్టకు వెళ్లే పరుపుబండ దారి

- పర్యాటక కేంద్రంగా ప్రకటించాలి
- గిరిజనుల ఆరాధ్యుడు చిన్నయ్యదేవుడు
- దర్శనం కోసం తరలివస్తున్న భక్తులు

లక్సెట్టిపేట: మండలంలోని హన్మంతుపల్లి గ్రామ పంచాయతీ పరిధి చల్లంపేట గ్రామశివారు అటవీప్రాంతంలో సుమారు 150 ఏళ్లక్రితం నుంచి చిన్నయ్యగుట్టపై చిన్నయ్య దేవుడు కొలువై ఉన్నాడు. గిరిజనుల ఆరాధ్య దైవంగా వెలుగొందుతూ ఈ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధిగాంచాడు. చారిత్రాత్మకంగా వెలిసిన చిన్నయ్య దేవుడిని గిరిజనులు, భక్తులు తరలివచ్చి పూజిస్తుంటారు. ప్రాచీనకాలంలో పాండవులు ఇక్కడ వ్యవసాయం చేసేవారు. ద్రౌపది స్నానం చేయడానికి కొల్లు గుంటలు, పరుపు బండపై వ్యవసాయం చేసినట్లు నాగళి సాళ్లు, గుడి లోపల దొనలో పట్టే మంచం దేవుని విగ్రహాలు ఉన్నట్లు ఇప్పటికి పూర్వీకులు చెబుతుంటారు. వర్షాకాలం ప్రారంభ సమయంలో సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడకు దర్శనం కోసం వస్తుంటారు. రైతులు వరదపాశం బోనాలు వండి చిన్నయ్య దేవునికి నైవేద్యంగా సమర్పిస్తారు. పంట పొలాలకు పురుగులు సోకితే ఇక్కడి తీర్థపు నీరు పొలాలపై చల్లితే పోతాయనే వారి నమ్మకం.

అల్లుబండ..



గుట్టపై చిన్నయ్యదేవుని గుడి

గుడిలో అల్లు బండకు ప్రత్యేక స్థానం. అక్కడికి వచ్చిన భక్తులు తమ మనసులో కోర్కెలు కోరుకుని అల్లుబండ లేపితే సులభంగా లేచినట్లైతే కోరిక నెరవేరుతుంది. అల్లుబండ బరువుగా ఉంటే కోరిక నెరవేరదని నమ్మకం. అల్లుబండ ప్రదేశం వద్ద భక్తులు వారి కోర్కెలు కోరుకుంటారు.

చిన్నయ్య దేవుడి ప్రత్యేకత

పంట పొలాలు దుక్కి దున్నే ముందు దేవుడి దర్శనం చేసుకుంటారు. బండారు (పసుపు) తెచ్చుకుని ధాన్యం వేసేటప్పుడు అందులో కలిపి వ్యవసాయం సాగు చేస్తారు. పంట చేతికి వచ్చిన తర్వాత దినుసును దేవుడికి అప్పజెప్పి మొక్కిన మొక్కు చెల్లించుకుంటారు. వేసవికాలం ముగింపు సమయంలో చిన్నయ్య గుడి భక్తులతో కిటకిటలాడుతుంది.

ఇలా వెళ్లాలి..

పట్టణం నుంచి చందారం, హన్మంతుపల్లి, దొడపల్లి, రంగపేట, జెండావెంకటాపూర్ గ్రామాల మీదుగా 10 కి.మీ దూరం వాహనాలపై చల్లంపేట వరకు చేరుకోవాలి. అక్కడి నుంచి అటవీ ప్రాంతంగుండా సుమారు 3 కి.మీ కాలినడకన వెళ్తే చిన్నయ్యగుట్ట దేవుడి గుడికి చేరుకోవచ్చు. ఇక్కడికి వచ్చేందుకు అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉంది. సమీప ప్రాంతంలో నీళ్ల సదుపాయం చిన్నపాటి బుగ్గ వాగు లాంటిది ఉంటుంది. అందులోని నీటిని తాగడానికి వాడుతారు. ఇప్పటికి అక్కడ గిరిజనులే పూజార్లుగా కొనసాగుతుంటారు. ప్రతీ ఆది, గురువారాల్లో పూజలు నిర్వహిస్తారు. మేకలు, కోళ్లతో దేవుడికి మొక్కులు చెల్లించి ఆ తర్వాత వంట చేసుకుని సహపంక్తి భోజనాలు చేస్తారు. కాగా, బుగ్గవాగు ప్రాంతంపై బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు ఇటీవల రూ.కోటి నిధులు మంజూరు చేసి శిలాఫలకం వేశారు. ఇంకా పనులు ప్రారంభించలేదు.

పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలి



అటవీప్రాంతంలో ఉన్న చిన్నయ్యగుట్టను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలి. రహదారి మధ్యలో మత్తడి నీటిని నిల్వచేయడంతోపాటు వాటికి అనుకూలంగా రోడ్డు ఏర్పాటు చేస్తే పుణ్యక్షేత్రంగా, పర్యాటక కేంద్రంగా ఏర్పడుతుంది. ఆలయానికి ప్రత్యేక హోదా లభిస్తుంది. గిరిజనుల ప్రత్యేక ఆలయం ప్రత్యేకంగా ఉంటుంది. భక్తుల సంఖ్య పెరుగుతుంది.

– అన్నం చిన్నన్న, గ్రామస్తుడు, చందారం

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



పట్టుకున్న నకిలీ విత్తనాలతో ఏవో సృజన, పోలీసులు

నెన్నెల: మండలంలోని నందులపల్లి గ్రామానికి చెందిన తోట వెంకటేశం వద్ద శుక్రవారం రూ.1.20 లక్షల విలువ కలిగిన 40 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. నందులపల్లిలో నకిలీ విత్తనాల క్రయవిక్రయాలు జరుగుతున్నట్లు ఏవో పుప్పాల సృజన ఫిర్యాదు చేయగా సోదాలు చేశామన్నారు. నందులపల్లి ప్రాజెక్టు ప్రాంతంలో 40 కిలోల విత్తనాలను తన చేనులో దాచేందుకు ప్రయత్నిస్తూ వెంకటేశం పట్టుబడ్డాడని చెప్పారు. మందమర్రికి చెందిన పిండి సురేశ్ వద్ద లూజ్ విత్తనాలు కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. రెండు విత్తన సంచులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



తల్లికి అప్పగిస్తున్న డీసీపీవో మహేశ్, సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: తప్పిపోయిన బాలుడిని క్షేమంగా తల్లికి శుక్రవారం అప్పగించినట్లు డీసీపీవో మహేశ్ తెలిపారు. సికింద్రాబాద్ నుంచి తప్పిపోయి దక్షిణ ఎక్స్‌ప్రెస్ రైలులో కాగజ్‌నగర్ రైల్వే పోలీసులకు పట్టుబడగా, ఈనెల 9న జిల్లా కేంద్రంలో బాల రక్షభవన్‌కు అప్పగించారు. రక్షభవన్ సిబ్బంది బాలుడికి కౌన్సెలింగ్ నిర్వహించి మాట్లాడి వారి సొంత గ్రామమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లాగా గుర్తించారు. తల్లిదండ్రులకు సమాచారం అందించగా, తల్లి ఇక్కడకు రాగా, బాలుడిని అప్పగించినట్లు డీసీపీవో మహేశ్ తెలిపారు. సిబ్బంది శ్రావణ్, ప్రవీణ్ కుమార్, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

20 ట్రాక్టర్లు సీజ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముల్కల్ల ఇసుక రీచ్ వెళ్లే రహదారిలో శుక్రవారం హాజీపూర్ పోలీసుల ఆకస్మిక తనిఖీల్లో 20 ట్రాక్టర్లు సీజ్ చేశారు. ఇటీవల ముల్కల్ల ఇసుక రీచ్‌కు వెళ్లే జాతీయ రహదారిపై ఇసుక ట్రాక్టర్ ఢీ ఒకరు మృతి చెందడంతో ఎస్సై స్వరూప్‌రాజ్ ఆధ్వర్యంలో తనిఖీ చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలతోపాటు డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ లేని మొత్తం 20 ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం పోలీస్ స్టేషన్ ఆవరణలో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశమయ్యారు. వాహనానికి ఇన్‌స్రూ?న్స్ విధిగా ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు ఉంటాయన్నారు. కాగా సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి సరైన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ ఉన్న వాహనాల పత్రాలు పరిశీలించి జరిమానాలు విధించి పంపించారు. మిగిలిన ట్రాక్టర్లను జిల్లా రవాణా శాఖకు బదలాయించారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

తిర్యాణి: కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని దేవాయిగూడ పంచాయతీ పరిధిలోని చందగూడ గ్రామానికి చెందిన కుర్సెంగ గోపాల్ (27) గత మూడేళ్లుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడేవాడు. స్థానికంగా మందులు వాడినా నొప్పి తగ్గలేదు. ఈ క్రమంలో మనస్తాపం చెంది గురువారం మధ్యాహ్నం గ్రామశివారులోని పంట చేనులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని సోదరి అయిన కమలకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబీకులు ఘటన స్థలానికి చేరుకుని గోపాల్‌ను గోలేటిలోని సింగరేణి ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తండ్రి రాము ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెళ్లి ఇష్టం లేక యువతి..

ఖానాపూర్: పెళ్లిచేసుకోవడం ఇష్టం లేక యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ కథనం ప్రకారం..మండలంలోని పాత ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని ఒడ్డెవాడకు చెందిన అల్లెపు పోశాని, రాజేందర్ దంపతుల కూతురు అక్షయ (18) ఇంటర్ చదువుతోంది. గతకొన్ని రోజులుగా యువతికి పెళ్లి సంబంధాలు వస్తున్నాయి. తల్లిదండ్రులు పెళ్లి చేసుకోవాలని కోరగా యువతికి ఇష్టం లేదు. ఈక్రమంలో మనస్తాపంతో గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుంది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తిర్యాణి: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని మార్కగూడ పంచాయతీ పరిధి వాడిగూడ గ్రామానికి చెందిన మెస్రం యేసు (50)గురువారం గృహ అవసరాల వస్తువుల కొనుగోలు కోసం బైక్‌పై తిర్యాణికి వచ్చాడు. తిరిగి రాత్రి ఇంటికి వెళ్తుండగా కై రిగూడ సమీపంలో రెండు ఎద్దులు పొట్లాడుకుంటూ వచ్చి అటుగా బైక్‌ను ఢీకొట్టాయి. యేసు తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతన్ని చెలిమల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమచికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు సంతోశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.


గోదావరి నదిలో పడి యువకుడు..

బాసర: బాసర గోదావరి నదిలో ప్రమాదవశాత్తు యువకుడి పడి మృతిచెందినట్లు ఎస్సై శ్రావణి తెలిపారు. ఆమె కథనం ప్రకారం..బిహార్ రాష్ట్రానికి చెందిన శర్మ దిల్‌కుష్(19) బాసరలో హమాలీ పనిచేస్తున్నాడు. తన కుటుంబ సభ్యులతో కలిసి కొన్నిరోజుల క్రితం ఇక్కడకు వచ్చాడు. శుక్రవారం బాసర గోదావరి రెండో ఘాట్ వద్ద స్నానాలు ఆచరించేందుకు కుటుంబ సభ్యులు రాగా, ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడు. ఈత రాకపోవడంతో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లతో గాలించి యువకుడి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతదేహాన్ని భైంసా ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని ఒకరు..

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ రాళ్లపేట రైల్వేస్టేషన్ల మధ్య వంజిరి రైల్వేగేటు సమీపంలో శుక్రవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. రైలు పట్టాలు దాటుతుండగా బల్లార్షా నుంచి మంచిర్యాల వైపు వెళ్లే రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్ తెలిపారు. మృతుడికి 50 నుంచి 55 వయస్సు ఉంటుందని, బ్రౌన్, వైట్ లైనింగ్‌కలర్ ఫుల్‌షర్టు, సిమెంట్ కలర్ నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు.

ట్రాక్టర్ కిందపడ్డ మహిళా కూలీ..



స్వప్న మృతదేహం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీ పరిధి గంగాయిపేట్ గ్రామ శివారులో ఇటుకబట్టి వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి గాయ పడ్డ గిరిజన కూలీ మృతిచెందింది. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాయిపేట్ గ్రామానికి చెందిన మేస్రం స్వప్న(35) ఇటుక బట్టి వద్ద ట్రాక్టర్‌లో ఇటుకలు నింపేందుకు వెళ్లింది. ఇటుకలు నింపిన తర్వాత ట్రాక్టర్‌ను వెనక్కి తీస్తుండగా ఆమెకు తగిలి కింద పడింది. ఆమె పై నుంచి ట్రాక్టర్ టైరు వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ చనిపోయింది. స్వప్నకు భర్త, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హాయ్.. అయాం పూజ అంటూ టోకరా

- మహిళల పేరిట చాటింగ్
- కోరిక తీరుస్తామంటూ ఎర
- తీరా వచ్చాక నిలువు దోపిడీ
- ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు



నిందితుల అరెస్టు చూపుతున్న కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ముగ్గురు యువకులు ముఠాగా ఏర్పడ్డారు. మహిళల పేరిట యువకులతో చాటింగ్ చేస్తూ కోరికలు తీరుస్తామంటూ ఎరవేస్తున్నారు. ఈ ఓ వ్యక్తిని మభ్యపెట్టి దోపిడీకి పాల్పడిన సంఘటన కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలో వెలుగు చూసింది. ఇద్దరు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేయగా, మరొకరు పరారీలో ఉన్నాడు. కొత్తపల్లి పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపల్లి మండలం చింతకుంట శాంతినగర్‌కు చెందిన సరళ సందీప్(19), మల్కాపూర్ లక్ష్మిపూర్‌కు చెందిన పొన్నాల ప్రణయ్‌కుమార్(18), ఎండీ రెహాన్ జల్సాలకు అలవాటు పడి, దోపిడీలకు కొత్త రకం పన్నాగం పన్నారు. మహిళల పేరిట కోరిక తీరుస్తామంటూ వాట్సాప్‌లో యువకులకు మెసేజ్ చేస్తారు. ఆకర్షితులైన యువకులను చాటింగ్‌తో మభ్యపెడతారు. సరళ సందీప్ ఈ నెల 6న తన ఫోన్ ద్వారా మంచిర్యాల ప్రాంతానికి చెందిన ఓ యువకుడికి వాట్సాప్‌లో హాయ్ అయాం పూజ అంటూ మెసేజ్ చేశాడు. స్పందించి యువకుడు చాటింగ్ చేశాడు. కోరిక తీరుస్తానంటూ ఆశ చూపడంతో అది నమ్మి ఈ నెల 11న కరీంనగర్ వచ్చాడు. పథకం ప్రకారం దోపిడీకి సిద్ధమైన ముగ్గురు యువకులు కొత్తపల్లికి రప్పించారు. ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై యువకుడిని వెలిచాల శివారు ప్రాంతానికి తీసుకెళ్లారు. అప్పటికే అక్కడికి చేరుకున్న రెహాన్‌తో కలిసి యువకుడిని చిత్రహింసలకు గురిచేశారు. రూ.50వేలు డిమాండ్ చేశారు. ఇవ్వకుంటే చంపుతామని బెదిరించడంతో తన వద్ద ఉన్న రూ.10వేలు ఇచ్చాడు. బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి మరో రూ.12వేలు ఫోన్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశాడు. ముగ్గురు నిందితులు సదరు యువకుడిని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. బాధితుడు కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై ఎస్ సాంబమూర్తి ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం రేకుర్తి బస్టాండ్ ప్రాంతంలో సరళ సందీప్, పొన్నాల ప్రణయ్ కుమార్‌ను అరెస్టు చేశారు. రెహాన్ పరారీలో ఉన్నాడు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే పీడీయాక్ట్

- మున్సిపల్ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తి రిమాండ్
- ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలో కోట్ల రూపాయల మున్సిపల్ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన ఏ-2 అక్రమ్ మున్సిపల్ ఖాళీ స్థలాన్ని ఆక్రమించాలనే ఉద్దేశంతో తన బంధువు షాబొద్దీన్ పేరిట దస్తావేజులు సృష్టించినట్లు తెలిపారు. 35 ఏళ్లుగా అక్కడే ఉంటున్నట్లు ఇంటినంబర్ తీసుకున్నాడు. అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్ నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదుతో పలు కేసులు నమోదు చేసినట్లు వివరించారు. భుక్తాపూర్‌లో 469.44 స్వేర్ యార్డ్స్ ఆక్రమించి ఇంటి నం.6-6-36/2/1 తీసుకున్నాడు. మున్సిపల్ సిబ్బంది పాత్రపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై నాన్‌బెయిలబుల్ కేసులతోపాటు పీడీయాక్ట్ నమోదు చేస్తామన్నారు. ల్యాండ్ మాఫియా, రౌడీలు గతంలో బెదిరింపులకు పాల్పడి రిజిస్ట్రేషన్ చేసుకుని ఉంటే పోలీసులను ఆశ్రయించాలన్నారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

తండ్రిని చంపిన తనయుడికి ఐదేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వనందుకు తండ్రిని చంపిన తనయుడికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ జిల్లా జడ్జి ప్రభాకరరావు తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి పండరి తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన ముదిగంపల్లి సురేశ్ 2021 జూలై 25న బండతో తండ్రిని కొట్టి హత్య చేశాడు. సురేశ్ తాగుడుకు బానిసై తండ్రితో తరచూ గొడవ పడేవాడు, మద్యం కోసం డబ్బులు అడిగేవాడని, ఇవ్వకపోవడంతో తండ్రిని చంపినట్లు తల్లి ముదిగంపల్లి లక్ష్మి మావల స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కోర్టు డ్యూటీ అధికారి సంతోష్ 11 మంది సాక్ష్యులను కోర్టులో హాజరుపర్చగా, పీపీ మధుకర్ నేరం రుజువు చేయడంతో జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు. ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు.

బాసరకు పోటెత్తిన భక్తులు

బాసర: బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం సంకష్ట హార చతుర్థి శుభ ముహూర్తం ఉండడంతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లలో బారులు తీరారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అక్షరాభ్యాస మండపంలో చిన్నారులకు తల్లిదండ్రులు అర్చకులతో అక్షర శ్రీకార పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై శ్రావణి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిజాయతీ చాటుకున్న యువకుడు



బ్యాగును అప్పగిస్తున్న మారుతి

బాసర: బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తుడు పోగొట్టుకున్న బ్యాగును యువకుడు అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రకాశ్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం బాసరకు వచ్చారు. గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. మొదటి పుష్కర ఘాట్ వద్ద రెండు సెల్‌ఫోన్లు, బ్యాగును మరిచిపోయారు. అక్కడే ఉన్న యువకుడు మారుతి గమనించి ప్రకాశ్‌కు బ్యాగు, సెల్‌ఫోన్లు తిరిగి అప్పగించాడు. యువకుడిని స్థానికులు అభినందించారు.

అధిక మద్యం తాగి ఒకరి మృతి

జైనథ్: మండలంలోని బెల్గాం గ్రామంలో అధిక మద్యం తాగి చౌహాన్ (32)మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్ర నుంచి చౌహాన్ ఇక్కడకు వలస వచ్చి రోజువారి కూలీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత రెండు రోజుల నుంచి అధిక మద్యం తాగడంతో మృతిచెందినట్లు తెలిసింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉరేసుకుని రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి మచ్చ వీరయ్య (78) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం రాత్రి బాత్రూమ్‌లో ఐరన్ రాడ్‌కు ఉరేసుకుని కనిపించాడు. గత రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కళ్లు సరిగ్గా కనిపించకపోవడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.